ముందుకు.. వెనక్కు!

ఎస్‌బీఐ కాలనీ సిగ్నల్ వద్ద ట్రాఫిక్‌తో పరేషాన్

చక్రబంధంలో ఎటూ వెళ్లలేక వాహనదారుల అవస్థలు



ఎస్‌బీఐ కాలనీకి వచ్చే రూట్‌లో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద గజిబిజిగా వాహనాలు

హైటెక్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) కార్యాలయం నుంచి ఎస్‌బీఐ కాలనీ ట్రాఫిక్ సిగ్నల్ నాలుగు రోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు నరకయాతన పడుతున్నారు. ఖైత్లాపూర్ బ్రిడ్జి నుంచి మాదాపూర్ వెళ్లే వాహనాలు, మాదాపూర్ అయ్యప్ప సొసైటీ నుంచి కూకట్‌పల్లి వైపు వెళ్లే వాహనాలు ఇక్కడ యూటర్న్ తీసుకుంటున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు. అంతేగాకుండా ఇక్కడి నుంచి మాదాపూర్ వెళ్లే రూట్‌లో బాటిల్ నెక్ ఉంది. దానికి తోడు రోడ్డంతా గుంతల మయం కావడంతో వాహనదారులు ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంటున్నారు.

ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద గజిబిజి

ఒక్కోసారి సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సిబ్బంది లేక పోవడంతో ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు దూరిపోతున్నారు. ఉదయం వేళ ఐటీ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ట్రాఫిక్‌లో చిక్కుకుని సమయానికి ఆఫీసులకు వెళ్లలేక పోతున్నారు. ఇక వర్షం వస్తే సమస్య మరింత తీవ్రం అవుతుంది.

వన్ వే చేస్తే..

ఎస్‌బీఐ కాలనీ.. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వన్ వే చేస్తే కొంతవరకు ట్రాఫిక్ పరిష్కరించవచ్చని ఆ మార్గంలో వెళ్లే వాహన దారులు అభిప్రాయపడుతున్నారు. అయితే మాదాపూర్ నుంచి వచ్చే వాహనాలు కాస్త ముందుకెళ్లి యూటర్న్ తీసుకోవాల్సి వస్తుంది. ఆఫీసుల్లో విధులు ముగించుకుని తొందరగా ఇళ్లకు వెళ్లాల్సిన వారు పోలీసులకు సహకరించాలి.

వన్ వే చేస్తే ఇబ్బందులు

ఉదయం పీక్ అవర్‌లో ట్రాఫిక్ సమస్య ఎక్కువే. అయితే, అక్కడ వన్ వే చేస్తే ఇబ్బందులు వస్తాయి. బాటిల్ నెక్ వద్ద రోడ్డు విస్తరణ చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది. మాదాపూర్‌కు వెళ్లే రహదారిలో కూడా డ్రైనేజీ సమస్య ఉంది. దానికి మరమ్మతులు చేస్తేనే ట్రాఫిక్ సమస్య తీరుతుంది.

\- సత్యనారాయణ, మాదాపూర్ ట్రాఫిక్ సీఐ

జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన

● కళింగ కల్చరల్ హాల్‌లో..



జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న డా.పి. నిఖిలారెడ్డి

బంజారాహిల్స్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని కళింగ కల్చరల్ హాల్లో జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన-2025ను మిసెస్ బెల్జియా తెలంగాణ ఫస్ట్ రన్నరప్ డా.పి.నిఖిలా రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని, నేటి తరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని అన్నారు. ప్రతీ ఒక్కరు చేనేతకారులను ప్రోత్సహించాలని కోరారు. నిర్వాహకులు జయేష్‌గుప్తా మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతిపని బృందాలు తమ సిల్క్, హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచారని తెలిపారు.

ఉప ఎన్నికలో బీఆర్ఎస్ విజయమే మాగంటికి అసలైన నివాళి



బూత్ కమిటీ నాయకులతో మాగంటి సునీత

బంజారాహిల్స్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలో బీఆర్ఎస్ విజయమే దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు అసలైన నివాళి అని ఆయన సతీమణి మాగంటి సునీత అన్నారు. గణపతికాంప్లెక్స్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం యూసుఫ్‌గూడ డివిజన్ బూత్ స్థాయి కమిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోపీనాథ్ చివరి వరకు ప్రజల కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు తమ కుటుంబసభ్యులు ముందువరుసలోనే ఉంటారని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధానకార్యదర్శి నర్సింగ్ దాస్ పాల్గొన్నారు.

పేదల ఇళ్లను కూల్చి నిర్మించనున్న రోడ్డు ఎవరి కోసం?

● కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



గురుబ్రహ్మనగర్ వాసులతో మాట్లాడుతున్న వెంకటేష్

బంజారాహిల్స్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్లను కూల్చి రోడ్డు ఎవరి కోసం నిర్మించనున్నారని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ప్రశ్నించారు. 40 సంవత్సరాలుగా ఉంటున్న గిరిజనుల గుడిసెలను తొలగించడం వెనక పెద్ద కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నందగిరిహిల్స్ గురుబ్రహ్మనగర్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. బస్తీ వాసులతో మాట్లాడారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, తహసీల్దార్ అనితా రెడ్డి రోడ్డు నిర్మాణం కోసం గుడిసెలను తొలగించాలని గురువారం కోరినట్టు స్థానికులు చెప్పారు. దీనికి ఆయన తీవ్రంగా స్పందించారు. నందగిరిహిల్స్ లే అవుట్‌లో లేని రోడ్డు ఇప్పుడు కొత్తగా ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట కోట్ల రూపాయలు విలువ చేసే స్థలాన్ని తీసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా జీవో నెంబర్.59 కింద క్రమబద్ధీకరించిన విధానాన్ని గురుబ్రహ్మనగర్‌కు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పేదల గుడిసెలను తొలగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నందగిరి హిల్స్‌లో ఉన్న హుడా స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని హైడ్రా దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు.

హోటళ్లలో అపరిశుభ్రత

ఖైరతాబాద్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు చట్నీస్ హోటళ్లలో శుక్రవారం ఆకస్మిక సోదాలు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్.36, బంజారాహిల్స్ రోడ్డునెంబర్.3లోని శాఖల్లో తనిఖీలు చేసిన అధికారులు వాటిలో పలు లోపాలను గుర్తించారు. నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తామని, జరిమానా విధిస్తామని ఫుడ్ సేఫ్టీ అధికారి సూర్య తెలిపారు.

ఎల్ఓసీ అందజేత

బోరబండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలో చేరిన ఎస్ఆర్‌టీ నగర్ యువతి జేబా ఫాతిమా చికిత్స కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.5 లక్షల ఎల్ఓసీని మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా శుక్రవారం ఆమె తండ్రి వసీమ్‌ఖాన్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హిదాయత్ మీర్‌ఖాన్, చెట్టి దేవేందర్, జీవన్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

సమస్త సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింటు తొగరి రఘునందన్ రాజ్ తండ్రి స్వర్గీయ తొగరి బాల్‌రాజ్, నివాసం: ఇ.నం.17-2-156, చౌని నదేఅలీ బేగ్ యాకుత్‌పురా, హైదరాబాద్ వారు దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తికి యజమాని మరియు స్వాధీనదారు. SRO కార్యాలయం, హైదరాబాద్ ఈస్ట్ వద్ద నమోదైన సదరు ఆస్తి యొక్క లింక్ డాక్యుమెంట్ అనగా రిజిస్టర్ సేల్ డీడ్ నం.12539/1989, తేది 14.09.1989 ను తన బంధువులకు చూపించే నిమిత్తం తన నివాసం నుండి జూబ్లీహిల్స్‌కు అతను ప్రయాణించే సమయంలో పోయినది. పైన తెలిపిన సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ ఎవరికైనా దొరికితే/ జాడ తెలిస్తే, నా క్లయింట్‌కు లేదా మా కార్యాలయంలో తిరిగి ఇవ్వగలరని మనవి.

దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరైనా వ్యక్తి/ వ్యక్తులు, ఆర్థిక సంస్థలు, బ్యాంకులు ఏదేని హక్కు టైటిల్, క్లెయిము లేదా అభ్యంతరములు కలిగి ఉంటే, వారి క్లెయిమును మద్దతు డాక్యుమెంటరీ రుజువుతో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఏడు (7) రోజులలోగా నా క్లయింట్‌ను లేదా మా కార్యాలయాన్ని సంప్రదించగలరు. ఏడు రోజుల గడువు మీరిన మీదట ఎలాంటి క్లెయిము పరిశీలించబడదు.

ఆస్తి షెడ్యూలు

రంగారెడ్డి జిల్లా, సరూర్‌నగర్ రెవెన్యూ మండలం, మీర్‌పేట్ గ్రామం వద్దగల సర్వే నం.174 భాగంలోని 150 చ.గజాలు లేదా 125.41 చ.మీటర్ల విస్తీర్ణం గల ప్లాట్ నం.3 కలిగిన భూమి యావత్తు మరియు సరిహద్దులు: ఉత్తరం: రోడ్డు, దక్షిణం: ప్లాట్ నం.4, తూర్పు: 20 అ. వెడల్పు రోడ్డు, పశ్చిమం: ప్లాట్ నం.6.

సం/- చంద్రశేఖర్ సుంకు - అడ్వకేట్
ఇ.నం.83-191/136 (188/సి), వెంగళరావునగర్ కాలనీ, హైదరాబాద్ - 500038,
ఫోన్ నం: 9247408839



మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులను సన్మానిస్తున్న ప్రదీప్‌కుమార్

మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులకు సన్మానం

బేగంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు అధ్యాపకులను తులసిభవన్ డివోషనల్ లిటరరీ కల్చరల్ స్టడీస్ సంస్థ ప్రతినిధులు ఉత్తమ అధ్యాపకులుగా ఎంపిక చేశారు. త్యాగరాయ గానసభలో శుక్రవారం సంస్థ ఆధ్వర్యంలో టీచర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల తెలుగు విభాగానికి చెందిన కిషన్, సంస్కృత విభాగానికి చెందిన కె.వెంకటేశ్వర్లు, హిందీ విభాగానికి చెందిన అఫ్సరున్నీసా బేగంను సంస్థ డైరెక్టర్, ప్రముఖ విద్యావేత్త ప్రొ.ప్రదీప్‌కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఓవర్ హెడ్ వాటర్‌ట్యాంక్ కూల్చివేత



వాటర్‌ట్యాంక్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

వెంగళరావునగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ కాలనీలో శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ వాటర్‌ట్యాంక్‌ను ఎట్టకేలకు శుక్రవారం హైడ్రా కూల్చివేసింది. హైడ్రా ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, సిబ్బంది భారీ ఎక్స్‌కవేటర్, క్రేన్ సహాయంతో కూల్చివేత పనులు ప్రారంభించారు. ముందుగా పిల్లర్లకు రంధ్రాలు చేశారు. భవనాలు, ఆలయం వైపు కూల్చివేయకుండా, ఖాళీ స్థలం వైపు కూల్చివేశారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా కూల్చివేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎర్రగడ్డలో వీధిదీపాల ఏర్పాటుకు కృషి

ఎర్రగడ్డ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్ పరిధిలో వీధిదీపాల ఏర్పాటుకు కృషి చేస్తానని రహ్మత్ నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సబ్ ఇంజనీర్ మానస, ఏడీఈ వంశీకృష్ణ, నాయకుడు ఆకాష్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

బోరబండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏకేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో రహ్మత్ నగర్ డివిజన్‌లోని పలుచోట్ల శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాలను నిర్వహించారు. మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్ యాదవ్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాల్లో వందలాది మందిని వైద్యులు పరీక్షించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కంటి శుక్లాలు ఉన్నవారికి త్వరలోనే ఉచితంగా ఆపరేషన్లను చేయిస్తామని ఈ సందర్భంగా అంజన్ కుమార్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్యార నాగరాజు, ఎం.డి.జాఫర్, ఏసుదాస్ మలాకి, హుస్సేన్, ఎం.డి.ఇబ్రహీం, దేవేందర్, సయ్యద్ ఉమర్ అలీ పాల్గొన్నారు.



విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో మహిళ మృతిచెందింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భోపాల్ భరత్ భవన్‌కు చెందిన సుమన్, పర్మిళ పరియర్ దంపతులు. లక్ష్మీనరసింహ నగర్‌లో నివసిస్తున్నారు. గురువారం రాత్రి పర్మిళ పరియర్ ఇంట్లో వాటర్ మోటారు స్విచ్ ఆన్ చేసింది. ఒక్కసారిగా మోటారు నుంచి కరెంట్ షాక్ రావడంతో స్పృహ తప్పి కిందపడింది. సుమన్ వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. దీంతో సుమన్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆస్తిపన్ను, వ్యాపార లైసెన్స్‌లపై దృష్టి పెట్టాలి

ఖైరతాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను వసూళ్లతో పాటు వ్యాపార లైసెన్స్‌లపై దృష్టి సారించాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. శుక్రవారం కార్యాలయంలో ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్‌లు, ఫుడ్ సేఫ్టీ, ప్రాజెక్ట్ వర్క్స్‌తో పాటు యూబీడీ విభాగాల పని తీరుపై ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరనిలోటు

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మాజీ అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరనిలోటని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ చౌరస్తాలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత కుటుంబంలో జన్మించినా, జీవితాంతం పేదవర్గాల కోసం పనిచేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దండు సత్యనారాయణ, భద్ర, రావర్తి అశోక్, కె.యాదగిరి, ఆసిఫ్, బ్రహ్మం, ప్రేమ్ పాల్గొన్నారు.

నేడు కంటి ఆస్పత్రి ప్రారంభం

బేగంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బల్కంపేటలో శంకర నేత్రాలయంను రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు, ప్రముఖ నేత్ర వైద్యులు డా.ఎస్.రవీంద్ర గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ పాల్గొంటారని ఆయన తెలిపారు.

శ్మశానవాటికలో వ్యభిచార కార్యకలాపాలు

● నిర్వాహకురాలు అరెస్ట్.. ఇద్దరికి నోటీసులు

బేగంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిత్యం విటులను తీసుకొచ్చి శ్మశానవాటికలోని ఓ గదిలో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళను అరెస్ట్ చేయడంతోపాటు మరో ఇద్దరికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ సంఘటన బేగంపేటలోని దనియాలగుట్ట శ్మశానవాటికలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దనియాలగుట్ట శ్మశానవాటికలోని ఓ గదిలో కొంతకాలంగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. దీంతో గురువారం రాత్రి నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ గదిపై దాడి చేశారు. వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్న మాధవి(39)ని అరెస్ట్ చేశారు. అదే సమయంలో గదిలో ఉన్న ఒక మహిళతో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని నోటీసులు జారీ చేశారు. దీనికి అక్కడ ఉన్న కాపలాదారు కుటుంబసభ్యులే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, మాధవిపై బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

15, 16వ తేదీల్లో డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్(టీఎస్సీహెచ్ఈ) ఆదేశాల ప్రకారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీ కోసం ఈనెల 15, 16వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజేంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాలలో సంప్రదించాలని ఆయన సూచించారు. అభ్యర్థులు అడ్మిషన్ సమయంలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. మధురానగర్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ బస్తీ రత్నదీప్ సూపర్ మార్కెట్ ప్రాంతంలో గురువారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. ఎం.సాయికిరణ్ చారి, ఎ.సోమశేఖర్ పారి పోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి దొరికింది. సెల్‌ఫోన్, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు అద్దె ఇవ్వడం లేదని ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కారును లీజుకు తీసుకొని అద్దె ఇవ్వడం లేదని ఓ వ్యక్తి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావు నగర్‌కు చెందిన చొక్కా ప్రవీణ్ కుమార్ కారు(ఏపీ 39 ఆర్‌వి 7785)ను జూమ్ కార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వాహకుడు అస్సర్ హుస్సేన్ లష్కర్‌కి లీజుకు ఇచ్చాడు. కొన్ని నెలలుగా కారు అద్దె చెల్లించకుండా, కారు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. శుక్రవారం ప్రవీణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.




రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మోండా డివిజన్‌లో రూ.1.34 కోట్లతో సీసీ రోడ్లు

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులు చేపడుతున్నామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం మోండా డివిజన్‌లో రూ.1.34 కోట్ల వ్యయంతో బండిమెట్, జైన్‌టెంపుల్, రాజేశ్వరి థియేటర్ ప్రాంతాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పర్యటించినపుడు డ్రైనేజీ, రోడ్ల సమస్యలు గుర్తించి డ్రైనేజీ, స్టార్మ్ వాటర్ లైన్ నిర్మించడం జరిగిందని, ఇప్పుడు రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. స్థానికులు వేలాడుతున్న కేబుల్ వైర్లతో ప్రమాదం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీ డాకునాయక్, కార్పొరేటర్ కొంతం దీపిక, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, డీఈ మహేష్, డీజీఎం ఆశిష్, డీఈ వెంకటేష్, ఏఈ వరలక్ష్మీ, ఆకుల హరికృష్ణ, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, నాగులు, రాములు, సత్యనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



న్యూ సిటీ కాలనీ నాలా నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జంపన ప్రతాప్

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బోయినపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో జరుగుతున్న నాలా నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. బోయినపల్లి బాపూజీనగర్ న్యూ సిటీకాలనీ, పవన్‌విహార్ కాలనీకి వెళ్లే మూలమలుపులో ఉన్న ఓపెన్ నాలాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యను బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే రూ.11 లక్షల నిధులు కేటాయించారని సీఈఓ మధుకర్ నాయక్‌కు కాలనీవాసుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టర్ పనుల్లో జాప్యం జరుగకుండా చూసుకోవాలని, వర్షం పడుతున్నప్పుడు పనులు చేయవద్దని సూచించారు. బోర్డు ఇంజనీరింగ్ శానిటేషన్ విభాగం అధికారులతో పాటు, కాంట్రాక్టర్ సమన్వయం చేసుకుని నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దాఫేదార్ రామకృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పునరుద్ధరణకు కృషి: కార్పొరేటర్


శ్మశానవాటికలో సమస్యలపై మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ, అధికారులు

బౌద్ధనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలో శ్మశానవాటిక పునరుద్ధరణ కోసం కృషి చేస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. శుక్రవారం సీతాఫల్‌మండి శ్మశానవాటికను అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు చివరి కర్మలు నిర్వహించుకునేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తామన్నారు. సుమారు రెండుకోట్ల రూపాయల వ్యయంతో అధునాతన సౌకర్యాలతో మోడల్ శ్మశానవాటికగా తీర్చిదిద్దుతామన్నారు. అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని ప్రయాణికుడి మృతి



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కదులుతున్న రైలు నుంచి గుర్తుతెలియని ఓ ప్రయాణికుడి కింద పడి అక్కడికక్కడే మరణించిన ఘటన జెమ్స్ స్ట్రీట్ రైల్వేస్టేషన్ వద్ద చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ జెమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ మార్గమధ్యలో రైలులో ప్రయాణిస్తున్న గుర్తుతెలియని ప్రయాణికుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి కింద పడిపోయాడు. బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

యువమోర్చా అధ్యక్షుడి నియామకం


సాయికుమార్

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్ బీజేపీ యువమోర్చా అధ్యక్షుడిగా దుబ్బాక సాయికుమార్ నియమితులయ్యారు. విద్యార్థిగా ఉన్నపుడు ఏబీవీపీ నాయకుడిగా విద్యార్థుల సమస్యల కోసం పోరాడనని, ఇప్పుడు బీజేపీని మరింత బలోపేతం చేయడానికి యువతను సమన్వయం చేసుకుంటూ నడుస్తానని సాయికుమార్ తెలిపారు.

యువతి అదృశ్యం


దీపిక (ఫైల్)

బోయినపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రేమలో పడిందని తనలో మార్పు కోసం పెద్దనాన్న ఇంటికి వచ్చిన యువతి అదృశ్యమైన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, ఎస్సై శివశంకర్‌లు తెలిపిన వివరాల ప్రకారం బండ్లగూడకు చెందిన వీరాం రామ్ అనే వ్యక్తి తన కూతురు దీపిక ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన రాహుల్ అనే యువకుడితో పరిచయంలో ఉందని తండ్రికి తెలియడంతో మందలించి బోయినపల్లి దిల్‌కుష్‌నగర్‌లోని తన అన్న మోహన్‌లాల్ ఇంటికి పంపించారు. గురువారం పెద్దనాన్న ఇంట్లోని వారందరూ పని మీద బయటకు వెళ్లిన సమయంలో బీరువా నుంచి రూ.1లక్ష 50 వేల నగదు, 15 తులాల బంగారు నగలు తీసుకుని ఆమె ఇంటి నుంచి పారిపోయిందని తెలిపారు. ఇన్‌స్టాగ్రాంలో పరియమైన రాహుల్ అనే వ్యక్తితోనే ఆమె పారిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బస్‌షెల్టర్స్ లేక ప్రయాణికుల పాట్లు!

- అధికారుల నిర్లక్ష్యం
- బస్సుల కోసం రోడ్లపైనే నిరీక్షణ
- తాత్కాలిక షెల్టర్ల ఏర్పాటుకు విజ్ఞప్తి


వారాసిగూడ చౌరస్తాలో బస్టాప్ వద్ద రోడ్డుపై నిల్చున్న ప్రయాణికులు

బౌద్ధనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ చౌరస్తా నుంచి జామై ఉస్మానియా వరకు ప్రధాన రహదారిపై పలుచోట్ల బస్‌షెల్టర్లు లేకపోవటంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణీకులకు ఇబ్బందులు కలుగకుండా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆర్టీసీ ప్రకటనలు చేస్తున్నా అవి అమలు జరగటంలేదు. దీంతో ప్రయాణీకులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం రోడ్లపైనే అవస్తలు పడుతున్నారు. కనీసం తాత్కాలిక బస్‌షెల్టర్లును ఏర్పాటుచేయాలని వారు అధికారులను కోరుతున్నారు. జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ సమన్వయంతో బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా వారి సమన్వయ లోపంతో ప్రక్రియ వెనుకడుగు వేస్తుంది. నగరంలోని పలు చోట్ల ఆధునిక బస్‌షెల్టర్లు ఏర్పాటు చేస్తుండగా ఈ ప్రాంతాల్లో కనీసం నిలబడటానికి షెల్టర్లు కూడా లేవని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయటానికి స్థల ఇబ్బందులున్నాయని అధికారులు తెలుపుతున్నారు. చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ, ఆర్ట్స్ కాలేజీ తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజు వందలామంది ప్రయాణీకులు నగరంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు.

గతంలో ఈ ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించిన సందర్భాలు చాలా ఉన్నాయి. అధికారులు బస్‌షెల్టర్లు ఏర్పాటుపై జాప్యం చేస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు నేతలు పేర్కొంటున్నారు. సీతాఫల్‌మండి, వారాసిగూడ చౌరస్తాలు ప్రధాన బస్టాప్‌లు కావటంతో ఇక్కడ బస్‌షెల్టర్లు లేకపోవటం వల్ల చెట్లు బస్‌షెల్టర్లుగా ఉపయోగపడుతున్నాయి.

గతంలో ఈ ప్రాంతంలో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయటానికి అధికారులు ప్రయత్నించినా కొంతమంది వ్యాపారులు తమ షాపులు ముందుగా బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయవద్దని అడ్డుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ఈ ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేయాలి



వారాసిగూడ, ఆర్ట్స్ కాలేజీ తదితర ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు లేవు. వేసవి, వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ సమన్వయంతో బస్‌షెల్టర్లు లేని ప్రాంతాలను గుర్తించి, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

\- స్వాతి, టైలర్, వారాసిగూడ

బస్‌షెల్టర్లు ఏర్పాటు చేసే విధంగా కృషి



ప్రయాణీకుల అవస్తలు దృష్టిలో పెట్టుకుని సీతాఫల్‌మండి డివిజన్‌లో పలు చోట్ల బస్‌షెల్టర్లు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తున్నాం. మూడు నెలల కింద జరిగిన జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో మేయర్, అధికారులకు దృష్టికి తీసుకువచ్చాం. అధికారుల మీద ఒత్తిడి తీసుకురావటంతో చిలకలగూడ గాంధీ బొమ్మ వద్ద ఒక బస్‌షెల్టర్లు ఏర్పాటు చేశారు. కొన్ని బస్‌షెల్టర్లకు మరమ్మతులు చేయాల్సి ఉందని, వాటికి త్వరలో మరమ్మత్తులు చేయిస్తామని తెలిపారు. కొత్త బస్‌షెల్టర్లు ఏర్పాటు చేసే వరకు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు.

\- సామల హేమ, కార్పొరేటర్, సీతాఫల్‌మండి డివిజన్

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే


విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ టీచర్ అవతారం ఎత్తారు. ఆకస్మిక సందర్శనలో భాగంగా తిరుమలగిరి లాల్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయులు, విద్యార్థినులను ఆశ్చర్యానికి గురి చేశారు. విద్యార్థినీలను మీకు ఏమి కావాలని ప్రశ్నించడంతో వారు ఎమ్మెల్యేకు వాలీబాల్, క్యారమ్, టెన్నీకాయిట్, కంప్యూటర్ ల్యాబ్, క్రీడలకు సంబంధించిన పరికరాలు కావాలని కోరారు. వాటిని వెంటనే సమకూరుస్తానని హామీ ఇచ్చారు. ఆయన టీచర్ కుర్చీలో ఆసీనులై మీ టీచర్ పాఠ్యాంశాలు సరిగా బోధిస్తున్నారా? ఏ టీచర్ పాఠాలు సరిగా బోధిస్తారు? అని పదో తరగతి విద్యార్థినీలను అడిగారు. అందరూ మంచిగా చెబుతున్నారని వారు సమాధానం ఇవ్వగా సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాఠశాల మొత్తం విద్యార్థినీలతో కలిసి కలియతిరిగారు. పాఠశాలలో సోషల్ ల్యాబ్ ఏర్పాటు కంప్యూటర్ ల్యాబ్ పరికరాలు, నైపుణ్యాలు పెంచుకోవడానికి మంచి పుస్తకాలు, మధ్యాహ్న భోజనం చేయడానికి షెడ్డు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కూడా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేయాలనేదే నా ధ్యేయమని, ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి ఎన్ని నిధులైనా ఇవ్వడానికి సీఎం సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అత్యధిక నిధులు కేటాయిస్తుందని పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగనేని సరిత, మురళీ ముదిరాజ్ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే తిరుమలగిరి సర్దార్ పటేల్ కాలనీ చర్చి రోడ్డు, రోడ్డు నంబర్ 4లలో ప్రభుత్వ నిధులు రూ.21లక్షలతో వేయనున్న సిమెంటు రహదారుల నిర్మాణ పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు నాగనేని సరిత, మురళీ ముదిరాజ్, రేమండ్ హార్వుడ్, మురీ, డెంజిల్, విజయ్, నరేష్, కాలనీ ప్రెసిడెంట్ లింగమూర్తి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రజల కోసమే.. అడ్డుకోవడం సరికాదు


జీహెచ్‌ఎంసీ, కంటోన్మెంట్ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్


జేసీబీ పనులు నిలిపివేసిన కంటోన్మెంట్ బోర్డు అధికారులు

- కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్

బోయినపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు, జీహెచ్‌ఎంసీలకు ఆనుకుని ఉన్న ప్రాంతంలో జలమండలి నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనుల విషయమై అటు కంటోన్మెంట్ బోర్డు, మరోపక్కన జీహెచ్‌ఎంసీ అధికారుల నడుమ శుక్రవారం వాగ్వాదం నెలకొంది. బోర్డు పరిధిలో జీహెచ్‌ఎంసీని ఆనుకుని ఉన్న సీతారంపురం, మర్రిరాంరెడ్డినగర్ కాలనీ తదితర ప్రాంతాలు చిన్నపాటి వర్షానికే ముంపుకు గురవుతుంటాయి. ఈ క్రమంలో సమస్య పరిష్కారానికి గతంలో రూ.50 లక్షల నిధులతో ఓల్డ్ బోయినపల్లి డివిజన్ పరిధిలోని కల్యాణి థియేటర్ నుంచి న్యూబోయినపల్లిలోని సౌజన్య కాలనీ నాలావరకు భారీ డ్రైనేజీ పైపులైన్‌ను నిర్మించారు. ముంపు ప్రాంతాలగుండా ఉన్న నాలా ఎత్తును పెంచారు. అయినా వర్షాకాలంలో వరద నీటి ఉధృత్తి ఎక్కువగా ఉండటంతో ఆయా ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి.

ఓల్డ్ బోయినపల్లి డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలను ముంపు భారీ నుంచి తప్పించేందుకు ఆర్‌ఆర్ నగర్ నుంచి నిర్మించిన బాక్సు డ్రెయిన్‌ను బోర్డు పరిధి శివారులోని హర్షవర్ధన కాలనీ పార్కు వద్ద ఉన్న చిన్నపాటి నాలాలో కలపడంతో సమస్య మరింత ఎక్కువైంది. ఇప్పుడు డివిజన్ పరిధిలోని శివారులో ఉన్న కుమ్మరిబస్తీకి సంబంధించి చిన్నదిగా ఉన్న ప్రధాన పైపులైన్‌కు బదులుగా జలమండలి భారీ పైపులైన్‌ను నిర్మిస్తుంది. దాన్ని తీసుకువచ్చి కంటోన్మెంట్ ప్రాంతంలోని చైతన్య స్కూల్ ముందు ఉన్న మ్యాన్‌హోల్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులు కలపడానికి జేసీబీతో తవ్వి పనులు చేపడుతున్నారు. ఈ విషయమై కంటోన్మెంట్ బోర్డు అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండానే పనులు చేపడుతున్నారని సమాచారం అందుకున్న బోర్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశుతోష్ చౌహాన్ పనులను అడ్డుకోవడం జరిగింది. దీంతో కాసేపు కంటోన్మెంట్, జీహెచ్‌ఎంసీ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న ఓల్డ్ బోయినపల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ అక్కడకు చేరుకుని అధికారులను అడిగి విషయం తెలుసుకున్నారు. అనంతరం వారిద్దరిని శాంతింపజేశారు. ఈ నేపథ్యంలో పైపులైన్ నిర్మాణం విషయమై కంటోన్మెంట్ బోర్డు సీఈవోకు లేఖను రాయాలని కంటోన్మెంట్ బోర్డు అనుమతులు తీసుకోవాలని జలమండలి ఏఈకి సూచించి పనులను నిలిపివేయించారు. అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయిన ఆయన సీఈఓను కలవడానికి బోర్డు కార్యాలయానికి వెళ్లగా ఆయన అందుబాటులో లేరని వెనుదిరిగి వెళ్లినట్లు కార్పొరేటర్ తెలిపారు. అయితే అభివృద్ధి పనులు అనేవి ప్రజల కోసమేనని ఇలాంటి పనులకు హద్దులు, పరిధులు అంటూ ఉండకూడదని ఇలా పనులను అడ్డుకోవడం సరికాదని ఆయన అన్నారు.

పెన్షన్ల పెంపునకు 15న ఎమ్మార్వో కార్యాలయాల ముట్టడి


సమావేశంలో మాట్లాడుతున్న మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ నాయకుడు నరేంద్రబాబు

బౌద్ధనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వికలాంగులు, వృద్ధులు, వితంతువుల పెన్షన్ల పెంపుకై, నూతన పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ ఈ నెల 15వ తేదీన ఎమ్మార్వో కార్యాలయాలను ముట్టడి చేస్తున్నట్లు మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ నాయకుడు ఎస్.నరేంద్రబాబు మాదిగ తెలిపారు. శుక్రవారం పార్శీగుట్ట న్యూఅశోక్ నగర్ సేవాసంఘంలో హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో నరేంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే నిలబెట్టుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెన్షన్లు పెంచినట్లు తెలంగాణలో కూడ పెంచాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు రూ.6000, వితంతువులకు పెన్షన్ రూ.4000, అర్హులైనవారందరికి కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు 15న ఎమ్మార్వో కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి దయమణి, ముఖ్య కార్యకర్తలు నాగమణి, భూపతి సుజాత, సురారం సుజాత, వేణుగోపాల్, విజయ్‌మాదిగ, బాబురావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


తమ సమస్యలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు విన్నవిస్తున్న ఇంటర్నెట్, కేబుల్ ఆపరేటర్‌ల సంఘం ప్రతినిధులు

కేబుల్ ఆపరేటర్ల సమస్యను పరిష్కరించాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు

తార్నాక, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల ఇంటర్నెట్, కేబుల్ ఆపరేటర్లు ఉపాధి కోల్పోవాల్సి వస్తుందని, కేబుల్ ఆపరేటర్ల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. ఇంటర్నెట్, కేబుల్ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు శుక్రవారం ఆయనను తార్నాకలోని ఆయన నివాసంలో కలిసి శనివారం కేబుల్ ఆపరేటర్ల ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాకు హాజరై సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. ప్రభుత్వ చర్యలతో తాము తీవ్రంగా నష్టపోవడమే కాకుండా కేబుల్, ఇంటర్నెట్ సమస్యలు తలెత్తుతుండటంతో నగరవ్యాప్తంగా వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆయనకు వివరించారు.

కోట నీలిమకు నోటీసులు ఇవ్వడం హాస్యాస్పదం


సుధీర్

సికింద్రాబాద్/రాంగోపాల్‌పేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమకు కేంద్ర ఎన్నికల కమిషన్ నోటీసులు ఇవ్వడం హాస్యాస్పదమని పీసీసీ ప్రచార కమిటీ చీఫ్ కోఆర్డినేటర్ గంట సుధీర్ అన్నారు. 8 సంవత్సరాల క్రితమే నీలిమ ఫారం-6 పూర్తి చేసి, తన ఓటును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ దరఖాస్తు చేసుకున్నారని, ఈ మేరకు నేరుగా ఎన్నికల కమిషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారని తెలిపారు. అయితే ఎన్నికల కమిషన్ అనివార్య కారణాల వల్ల దీనిపై స్పందించకుండా, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ సర్కారు ఒత్తిడితో కోట నీలిమ రెండు చోట్ల ఓటుహక్కు కలిగి ఉన్నారంటూ రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. డాక్టర్ కోట నీలిమతోపాటు ఏఐసీసీ సోషల్ మీడియా చైర్మన్ పవన్ ఖేరాకు కూడా కేంద్ర ఎన్నికల కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్టు గంట సుధీర్ పేర్కొన్నారు. ఓట్ చోరీ ఉద్యమాన్ని రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేస్తుండడంతో బీజేపీ సర్కారు ఇటువంటి చిల్లర రాజకీయాలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు.


నల్లగుట్టలో పవర్ బోర్ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

పవర్ బోర్ పనులు ప్రారంభం

రాంగోపాల్‌పేట్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : నల్లగుట్ట చుట్టాలబస్తీ ప్రజల విజ్ఞప్తి మేరకు మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించి అక్కడ పవర్ బోర్‌ను మంజూరు చేయించారు. శుక్రవారం నల్లగుట్ట సుభాష్ మైదాన్ వద్ద పవర్‌బోర్ పనులను డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు పవర్ బోర్ మంజూరు చేయించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు, సహకరించిన బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు అతెల్లి శ్రీనివాస్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడు నర్సింగం సతీష్, ప్రధాన కార్యదర్శి మాతాంగి గణేష్, కిరణ్, వెంకట్, బస్తీవాసులు పాల్గొన్నారు.

ముందస్తు ఫీజు వసూలు చేయొద్దు

- ఓయూ అధికారులకు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ వినతి

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ సెకండ్ ఇయర్ విద్యార్థుల హాస్టల్, మెస్, కాలేజీల రెన్యూవల్ పేరుతో ముందస్తు ఫీజుల వసూలు చేసే పద్ధతిని ఓయూ అడ్మినిస్ట్రేషన్ విరమించుకోవాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నేతలు అన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓఎస్‌డీ ప్రొఫెసర్ జితేందర్ నాయక్, సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌లకు శుక్రవారం వినతిపత్రం అందించారు. సీపీజీఈటీ-2025 ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ గడువు పొడిగించాలన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయని కారణంగా లక్షలాది మంది విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సుమంత్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ కె.స్వాతి అన్నారు. ఓయూ అనుబంధ కాలేజీలైన నిజాం, సైఫాబాద్, సికింద్రాబాద్‌లలో డిగ్రీ పూర్తయినా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాలేదని విద్యార్థులే ఫీజులు చెల్లించాలనడం దారుణమన్నారు. సీపీజీఈటీ-2025 ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ గడువు సోమవారం ముగుస్తున్న నేపథ్యంలో గడువు పొడిగించాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటేష్, ఓయూ నాయకులు విజయ్‌కుమార్, బాలకృష్ణ, రాజు, సుజాత, అనిత, సంధ్య, శ్రావణి, విజయ్, అభినవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రేమించిన యువతి దక్కదేమోనని యువకుడి ఆత్మహత్య

బోయినపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించిన యువతి దక్కదేమోనని భావించిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందమూరినగర్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, ఎస్‌ఐ నందితలు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్‌కు చెందిన వంశీ(24) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బోయినపల్లిలోని నందమూరినగర్‌లో తన చిన్నమ్మ భూమవ్వ వద్ద ఉంటూ సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన బంధువుల అమ్మాయి శ్రీజ అనే యువతితో ప్రేమలో పడ్డాడు. ఈ విషయం కాస్త బంధువులకు తెలిసింది. దీంతో ఇటీవల దగ్గరి బంధువు మృతి చెందితే అక్కడకు వెళ్లిన వంశీని బంధువులు మందలించారు. అదేరోజు పాపన్నపేటలోని కళాశాలలో శ్రీజను కలవడానికి వెళ్లాడు. అక్కడ తనను ఇబ్బంది పెట్టవద్దని కోరగా, అతడు నిరాశ చెంది ఇంటికి తిరిగి వచ్చాడని తెలిపారు. దీంతో తాను ప్రేమించిన అమ్మాయి తనకు దక్కదేమోనని మనస్థాపం చెందిన వంశీ అదేరోజు అర్ధరాత్రి బంధువులు అందరూ నిద్రపోయిన తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లి ఉరివేసుకుని చనిపోతున్నట్లు తన బావమరిది జల్ల శివయ్యకు ఫోన్ చేసి చెప్పడంతో వెంటనే వారు వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున నందమూరినగర్ రైల్వేట్రాక్ వద్ద ఉన్న ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న బోయినపల్లి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానవాటికలో వ్యభిచార కార్యకలాపాలు

బేగంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిత్యం విటులను తీసుకొచ్చి శ్మశానవాటికలోని ఓ గదిలో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళను అరెస్ట్ చేయడంతోపాటు మరో ఇద్దరికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ ఘటన బేగంపేటలోని దనియాలగుట్ట శ్మశానవాటికలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దనియాలగుట్ట శ్మశానవాటికలోని ఓ గదిలో కొంతకాలంగా వ్యభిచారం నిర్వహిస్తున్న ట్లు స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. దీంతో గురువారం రాత్రి నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ గదిపై దాడి చేశారు. వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్న మాధవి(39)ని అరెస్ట్ చేశారు. అదే సమయంలో గదిలో ఉన్న ఒక మహిళతో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని నోటీసులు జారీ చేశారు. దీనికి అక్కడ ఉన్న కాపలాదారు కుటుంబసభ్యులే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, మాధవిపై బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.